క్లుప్తంగా

దివ్యాంగులకు ఫిజియోథెరపీ



సి.బెళగల్‌లో ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు వీరేష్, పర్యవేక్షిస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో 14 మంది దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేసినట్లు ఎంఈఓ జ్యోతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ, మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులకు బాల్, పాడ్స్ తదితర పరికరాలపై వ్యాయమం చేయించారన్నారు. ఫిజియోథెరపిస్ట్ వీరేష్ మాట్లాడుతూ.. తాము చేయించిన వ్యాయామాన్ని దివ్యాంగుల కుటుంబ సభ్యులు ఇంటి దగ్గర కూడా చేయిస్తే ఫలితం త్వరగా ఉంటుందని చెప్పారు. అలాగే. ఐఈఆర్‌టీ మద్దిలేటి ప్రత్యేక బధిర బాలలకు పరికరాలతో విద్యను అందించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు హ్యాండ్‌బాల్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఈ నెల 22, 23 తేదీల్లో కర్నూలులోని ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ వెంకటేష్, పీడీ వెంకటేశ్వరనాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు నివాళి

పాణ్యం: మండల పరిధిలోని వడ్డుగండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గోనవరం శేఖర్ (56) కోలుకోలేక మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. శేఖర్ ఈ నెల 17వ తేదీన షంషాబాద్ వద్ద రైలు ఎక్కుతూ అదుపుతప్పి కింద పడిపోయాడన్నారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను హైదరబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతి చెందారన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఫోన్ ద్వారా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నీరుకట్టు రాముడు, ఎల్లక్రిష్ణ, కుసుమన్న, శేఖర్, గోపాల్ తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు.


రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎంపీడీఓ, బ్యాంక్ మేనేజర్

కర్నూలు(రూరల్): అర్హులైన వారికి ప్రభుత్వం నుంచి రుణాలు మంజూరవుతాయని కర్నూలు మండల ఎంపీడీఓ జి.రఘునాథ్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ-71, ఈబీసీ-11, కాపు-11 యూనిట్లు మంజూరు కాగా.. 1,190 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇంటర్వ్యూ 480 హాజరైనట్లు చెప్పారు.


బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న బ్యాంకు అధికారులు

కల్లూరు: బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ సోమవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో వివిధ బ్యాంకుల అధికారులు ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల నుంచి బీసీ రుణాలకు 502 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ తెలిపారు. వారిలో 230 మంది హాజరయ్యారు.

సాంకేతిక విజ్ఞానంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాణ్యం: విద్యార్థులు జ్ఞానాన్ని పెంచుకోవాలని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.వి.గోపిక్రిష్ణారావు అన్నారు. సోమవారం పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఇంజినీరింగ్ విద్యార్థులు పాఠశాల విద్యార్థులచే పలు ప్రాజెక్టులను తయారు చేయించారు. కన్వీనర్ శాంతల, వెంకటప్రసాద్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

ఆశ.. నిరాశేనా!

- నిరుద్యోగ యువతకు అందని ద్రాక్షగా కార్పొరేషన్ రుణాలు
- నియోజకవర్గానికి 268 యూనిట్ల కేటాయింపు
- 3,381మంది దరఖాస్తు
- లబ్ధిదారుల ఎంపికపై తలలు పట్టుకుంటున్న అధికారులు
- తమ వారికి దక్కించుకునేందుకు పచ్చనేతల పైరవీలు



కోడుమూరులో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఇచ్చేందుకు ఎగబడుతున్న అభ్యర్థులు

కోడుమూరు రూరల్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యమంటూ బీసీ కార్పొరేషన్ పరిధిలో రుణాలు పొందేందుకు ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు అరకొరగా యూనిట్లు మంజూరు చేసి చేతులు దులుపుకుంది. పదుల సంఖ్యలో యూనిట్లు ఉంటే వేల సంఖ్యలో నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. బీసీ, ఈబీసీ కార్పొరేషన్ యూనిట్లను కూడా తమ వారికి దక్కించుకునేందుకు పచ్చనేతలు పైరవీలు చేస్తున్నారు. సోమవారం కోడుమూరు, గూడూరు, కర్నూలు రూరల్ గ్రామాల్లో బ్యాంకు అధికారులు, సిబ్బంది యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలు పేరుకు మాత్రమే జరిగాయని, ఇంటర్వ్యూ పేరుతో దరఖాస్తులు తీసుకుని పంపించారే తప్ప అవి తమకు దక్కుతాయన్న ఆశలు లేవంటూ దరఖాస్తుదారులు వాపోయారు.

వేలల్లో దరఖాస్తులు..

నియోజకవర్గానికి మొత్తం బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ కింద 268 యూనిట్లు మంజూరవగా, వీటి కోసం 3,381 మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కోడుమూరు మండలంలో 68 యూనిట్లకు 1,281మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా, గూడూరు మండలంలో 50 యూనిట్లకు 388 మంది, కర్నూలు మండలంలో 93 యూనిట్లకు 1,090 మంది, బెళగల్ మండలంలో 57 యూనిట్లకు 622 మంది దరఖాస్తు చేసుకున్నారు.

అర్హులందరికీ రుణాలు ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి నిరుద్యోగ యువతకు ఎలాంటి పథకాలను అమలు చేయలేదు. ఉన్న కిరాణ దుకాణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని కార్పొరేషన్ కింద వచ్చే రుణం కోసం దరఖాస్తు చేసుకున్నా. తీరా ఇక్కడికొచ్చి చూస్తే వందల సంఖ్యలో దరఖాస్తులుంటే యూనిట్లు అతి తక్కువగా ఉన్నాయి. ఇవి తమకు దక్కుతాయన్న ఆశలు లేవు. ప్రభుత్వం స్పందించి అర్హులందరికీ కార్పొరేషన్ రుణాలు కేటాయిస్తే బాగుంటుంది.

– రఫీక్, ప్యాలకుర్తి గ్రామం, కోడుమూరు మండలం

పైరవీలకు తావులేదు

కార్పొరేషన్ రుణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి పైరవీలకు తావుండదు. అన్ని అర్హతలున్న నిజమైన లబ్ధిదారులకు మాత్రమే కార్పొరేషన్ రుణాలను మంజూరు చేస్తాం. ఇందులో ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు.

– జి.రఘునాథ్, ఎంపీడీఓ, కర్నూలు మండలం

నేడు రుణాలకు ఇంటర్వ్యూలు

సి.బెళగల్: మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు దారులకు మంగళవారం ఇంటర్వ్యూలను నిర్వహిస్తామని ఎంపీడీఓ రాణెమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి బీసీ కార్పొరేషన్ ద్వారా 50 యూనిట్లకు రూ.98.50 లక్షలు, మూడు ఈబీసీ యూనిట్లకు రూ.5.50 లక్షలు, నాలుగు కాపు కార్పొరేషన్‌కు రూ.13 లక్షలు మంజూరయ్యాయన్నారు. మొత్తం 57 యూనిట్లకు గాను 622 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులను బ్యాంకర్లు పరిశీలిస్తారని, దరఖాస్తుదారులు సంబంధిత ధ్రువ పత్రాలతో రావాలని సూచించారు.

గ్రూపు దేవాలయాల్లో చోటు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయాన్ని గడివేముల గ్రూపు టెంపుల్స్‌లో విలీనం చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈఓ రామలింగారెడ్డి సోమవారం తెలిపారు. ఈఓ మాట్లాడుతూ.. గత కొన్నేళ్ల నుంచి గడిగరేవుల అంజనేయస్వామి ఆలయం ధర్మకర్త ఆధీనంలో ఉండేది. ఈ ఆలయానికి 14.70 ఎకరాల పొలం ఉంది. ఈ ఆస్తంతా ఇకపై గడివేముల గ్రూపు దేవాలయం అధికారి ఆధీనంలో ఉంటుందన్నారు.

ఆధ్యాత్మిక భావన పెంపొందించాలి



స్వామివారికి పూజలు చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: సమాజంలో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జీవేశ్వర స్వామి సన్నిధిలో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఓంశాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన వ్రత కల్పనకు కాటసానితో, కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన అలవరచుకోవాలన్నారు. నిత్యం కొంత సమయం కేటాయించి ఓంశాంతి కేంద్రాలలో ఉచిత యోగా శిక్షణకు హాజరు కావాలని కోరారు. అనంతరం ఓంశాంతి బ్రహ్మకుమారీలు మహాలక్ష్మి, ఉషాకిరణ్ మాట్లాడుతూ.. వ్రతం విశిష్టత, వాటి ఫలితాల గురించి వివరించారు. పూజా కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 156 మంది దంపతులు పాల్గొన్నట్లు బీకే.రాధాకృష్ణ తెలిపారు. స్థానిక నాయకులు లక్ష్మికాంతారెడ్డి, మద్దికుంట రాంభూపాల్‌రెడ్డి, లింగం కిష్టయ్య, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ఉచిత వైద్య శిబిరం

గడివేముల: నంద్యాల జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో భోగేశ్వరాలయంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల రెడ్‌క్రాస్ చైర్మన్ వీవీ కృష్ణయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఆర్ఎంపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మహాశివరాత్రి సందర్భంగా 26, 27, 28 తేదీల్లో శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక ఎస్ఐ నాగార్జునరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆర్ఎంపీ వైద్యుల గౌరవాధ్యక్షుడు ఇందిరా వరదాచార్యులు, సెక్రటరీ వెంకటేశ్వర్లు, శ్రీధర్ బాబు, అనంత్‌కుమార్, ఉస్మాన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు



భోగేశ్వరాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

గడివేముల: మహాశివరాత్రి సందర్భంగా భోగేశ్వరాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని పాణ్యం సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి సూచించారు. ఆయన సోమవారం గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీదుర్గా భోగేశ్వరాలయాన్ని పరిశీలించారు. పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఐ మాట్లాడుతూ.. భక్తుల వాహనాలను ఆలయానికి కొద్ది దూరంలో పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జాగరణ సందర్భంగా భక్తులు అధికంగా తరలిరానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఈఓ రామానుజన్, సేవాకమిటీ సభ్యులకు సూచించారు. ఆలయ ప్రాంగణంలో లైటింగ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో నిఘా ఉంచుతామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎస్ఐ బీటీ నాగార్జునరెడ్డి, ప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ, సిబ్బంది ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఓర్వకల్లు: మండలంలోని పాలకొలను గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ నెల 26వ తేదీన జరిగే మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మిడుతూరుకు చెందిన త్రైత సిద్ధాంతం.. ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా శివలింగంపై ఉన్న మూడు విభూతి రేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మకు గుర్తుగా భావిస్తారని తెలిపారు. ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడని, అందుకే మధ్యలో వుండే విభూతి రేఖకు ఎర్రని బొట్టు పెట్టడం జరుగుతోందని పేర్కొన్నారు. మహాశివరాత్రి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు రామచంద్రుడు, గోకారి, శ్రీను, సుబ్బలక్ష్మి, సుజాత, హైమావతి, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి



తహసీల్దార్ అంజనేయులుకు వినతి పత్రం ఇస్తున్న బీసీ కులాల నాయకులు

కల్లూరు: రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో వాటాలు కల్పించాలన్నారు. ఏపీలో బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీల ఏబీసీడీ వర్గీకరణ మాదిరిగానే రాజకీయ రంగాల్లో కూడా వర్గీకరణ చేపట్టి ఎంబీసీ కులాలకు న్యాయం చేయాలన్నారు. బీసీ రుణాల మంజూరులో బ్యాంకులతో సంబంధం లేకుండా కార్పొరేషన్ల ద్వారానే నేరుగా రుణాలు మంజూరు చేయాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీ అభివృద్ధికి, సబ్‌ప్లాన్ అమలుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. బీసీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్, వివిధ బీసీ కులాల సంఘాల నాయకులు కేతురు మధు, బజారన్న, భరత్ కుమార్ ఆచారి, లింగన్న, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎవరిని అడగాలబ్బా!



సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయంలో బదిలీ అయిన అధికారుల పేర్లతో ఉన్న సహ చట్టం బోర్డు

సి.బెళగల్: సమాచార హక్కు చట్టం నిర్వహణలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం సమాచారం బోర్డును ఏర్పాటు చేశారు. గతంలో పనిచేస్తున్న అధికారుల వివరాలను బోర్డులో పేర్కొన్నారు. బోర్డులో మారిన అధికారుల వివరాలను మార్చలేదు. బోర్డులో పౌరసమాచార అధికారిగా 2023 జూన్ 13న మండలం నుంచి బదిలీ అయిన తహసీల్దార్ శివశంకర్ నాయక్ పేరు ఉండగా, 2022లో పదోన్నతిపై బదిలీ అయిన డీటీ ఉమారాణి పేరు సహాయ పౌర సమాచార అధికారిగా ఉంది. అలాగే.. అప్పిలేట్ అధికారిగా గతంలో కర్నూలు ఆర్డీఓగా పనిచేసిన వెంకటేశ్వర్లు పేర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఏదైనా సమాచారం నిమిత్తం వెళ్తే ఎవరిని సంప్రదించాలో తెలియక ప్రజలు అవస్థలు పడుతున్నారు. బోర్డులో పేర్కొన్న అధికారులెవరూ ప్రస్తుతం అక్కడ లేకపోవడం విశేషం. ఇప్పటికైనా ప్రస్తుత అధికారుల పేర్లను ప్రదర్శించాలని మండల వాసులు కోరుతున్నారు.

కార్పొరేషన్ రుణాలు ఇప్పించండి



రుణాలు మంజూరు చేయాలని ఎంపీడీఓను కోరుతున్న దివ్యాంగులు

సి.బెళగల్: బీసీ కార్పొరేషన్ ద్వారా తమకు రుణాలు మంజూరు చేస్తే దుకాణాలు ఏర్పాటు చేసుకుని స్వశక్తిగా జీవనం సాగిస్తామని, తమకు సహకరించాలని దివ్యాంగ మహిళలు ఎంపీడీఓ రాణెమ్మను కోరారు. సోమవారం సి.బెళగల్ మండల పరిధిలోని సంగాల గ్రామానికి చెందిన రంగమ్మ, కురువ లక్ష్మి, తిమ్మందొడ్డి గ్రామానికి చెందిన దివ్యాంగ మహిళలు సరోజ, రామలింగమ్మ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో వినతి పత్రాలు అందజేశారు.

మారని అధికారుల తీరు..

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరు కావడంలో అధికారుల నిర్లక్ష్యపు ధోరణి మారడం లేదు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉదయం 10:40 గంటల వరకు అధికారులు ఎవరూ రాలేదు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసేనాయక్, ఎంపీడీఓ రాణెమ్మ, ఏపీఓ రామన్న హాజరయ్యారు. కాగా తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం కార్యక్రమం నిర్వహించగా, ఏఓ మల్లేష్‌కుమార్ మాత్రమే హాజరు అయ్యారు. 11 గంటల అనంతరం కూడా మిగిలిన శాఖల అధికారులెవరూ రాలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కల్లూరు: 44వ జాతీయ రహదారి నాయకల్లు ఫ్లైఓవర్ దగ్గర సోమవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన రాహుల్ నాయక్ (22) మృతి చెందాడు. ఆదివారం అనంతపురంలో మృతిడి అన్న పెళ్లి జరిగింది. ఈ పెళ్లికి కుటుంబ సభ్యులతో ఆయన హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో రాత్రి కారులో అనంతపురం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో 44 జాతీయ రహదారి ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని నాయకల్లు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ముందు వెళ్తున్న లారీ సడన్‌గా బ్రేక్ వేయడంతో వారు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాహుల్‌నాయక్ అక్కడిక్కడే మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైవే మొబైల్-1, 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పందించిన సీఐ:

జోన్ సీఐ ఇంతియాజ్ బాషా విధులు ముగించుకుని అదే దారిలో వెళుతూ ప్రమాద సంఘటన చూసి వెంటనే స్పందించారు. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించాలని సిబ్బందిని అప్రమత్తం చేశారు. గాయపడిన వారిని హైవే మొబైల్-1 హెడ్ కానిస్టేబుల్ నూర్ అహ్మద్, ఉలిందకొండ పోలీసులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఏటీఎం చోరీకి విఫలయత్నం



చోరీని అడ్డుకున్న యువకులను అభినందిస్తున్న డీఎస్పీ బాబుప్రసాద్,



బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం కేంద్రాన్ని ధ్వంసం చేసిన దుండగులు

కర్నూలు: కల్లూరు మండలం ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంను చోరీ చేసేందుకు ప్రయత్నించగా స్థానిక యువకులు అడ్డుకోవడంతో అక్కడినుంచి పరారయ్యారు. షట్టర్‌ను రంపంతో కోసి లోపలున్న ఏటీఎంను తాళ్లతో కట్టి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా సెకండ్ షో సినిమా చూసి వస్తున్న గ్రామ యువకులు ఎం.మహేష్, షేక్ ఇలియాస్, దిలావర్ షేక్ అబ్దుల్ రహిమాన్, మొల్లా హనీఫ్ బాషా గమనించారు. వెంటనే ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. కర్నూలులోని ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని మహీంద్రా షోరూం వద్ద నిలిపి ఉంచిన టోయింగ్ వాహనాన్ని అపహరించిన దుండగులు చిన్నటేకూరు చేరుకొని ఏటీఎం మిషన్‌ను వాహనంలో తీసుకెళ్లేందుకు యత్నిస్తుండగా గ్రామ యువకులు అడ్డుకోవడంతో వాటిని అక్కడే వదిలేసి పరారయ్యారు. ఏటీఎంలో దాదాపు రూ.4 లక్షలకు పైగా నగదు ఉన్నట్లు సమాచారం.

సబ్ డివిజన్ అధికారులు అప్రమత్తం

ఏటీఎం దొంగతనం విషయం తెలిసిన వెంటనే కర్నూలు డీఎస్పీ జె.బాబుప్రసాద్ సబ్ డివిజన్ అధికారులను అప్రమత్తం చేశారు. డీఎస్పీతో పాటు సీఐలు చంద్రబాబునాయుడు, తబ్రేజ్, ఎస్ఐలు మధుసూదన్, ధనుంజయ, సునీల్‌కుమార్ తదితరులు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గతంలో కర్నూలు శివారులోని బాలాజీ నగర్‌లో ఇదే తరహాలో ఏటీఎం చోరీ జరిగింది. అప్పట్లో గస్తీ విధుల్లో ఉన్న హోంగార్డు దుండగులను హర్యానాకు చెందిన దొంగలుగా గుర్తించి అరెస్టు చేశారు. ప్రస్తుతం చిన్నటేకూరులో ఏటీఎం చోరీ యత్నం హర్యానా గ్యాంగ్ పనే అయిఉండొచ్చన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. దుండగులు ఏ వాహనంలో పారిపోయారనే దానిపై దృష్టి సారించి జాతీయ రహదారి వెంట ఉన్న చెక్‌పోస్టులలో సీసీ కెమెరాల ఫుటేజీని సేకరిస్తున్నారు. దొంగలను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగారు. మాస్కులు ధరించిన దొంగలు ఏటీఎం కేంద్రంలో ఉన్న సీసీ కెమెరా కనెక్షన్ కట్ చేసి, బ్లాక్ పెయింట్ పూసి చోరీకి యత్నించినట్లు తెలిసింది. చోరీని అడ్డుకున్న యువకులను కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ సోమవారం తన కార్యాలయానికి పిలిపించి అభినందించి రివార్డులను అందజేశారు.



అలంకరణలో భోగేశ్వరాలయం

ఉత్సవాలకు ముస్తాబు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో దక్షిణ కాశీగా పేరుగాంచిన దుర్గాభోగేశ్వరాలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఈ సందర్భంగా భోగేశ్వరుడు, శ్రీదుర్గాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, మామిడి తోరణాలు, అరటి బోదెలు, టెంకాయ మట్టలతో అలంకరించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను ఈఓ రామానుజన్ పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బారులు తీరిన పొగాకు బేళ్లు



విక్రయం కోసం వాహనాలతో తీసుకొచ్చిన పొగాకు బేళ్లు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో సోమవారం కొనుగోలు కేంద్రం వద్ద పొగాకు బేళ్లు బారులు తీరాయి. గతేడాది కొనుగోలు దారులు ఆశాజనకంగా ధరలు వేసి రైతుల్లో ఆశలు రేకెత్తించారు. దీంతో ఈ ఏడాది 60 శాతం మంది రైతులు పొగాకు పంటను సాగు చేశారు. జిల్లాలో ఓర్వకల్లు మండలంతో పాటు, కల్లూరు, వెల్దుర్తి, బెళగల్, మిడుతూరు, గడివేముల తదితర మండలాలకు చెందిన వేలాది మంది రైతులు పొగాకు పంటను పండించారు. వీటిని కొనుగోలు చేసేందుకు బీఎస్‌టీ, ఐటీసీ, తదితర కంపెనీలు ముందుకొచ్చాయి. ఈ నేపథ్యంలో మహాశివరాత్రి పండుగ రావడంతో పండుగ ఖర్చులకు వస్తాయనే అభిప్రాయంతో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు ఆటోలు, ట్రాలీ ఆటోలు, ట్రాక్టర్లను అద్దెకు తీసుకొని పొగాకు బేళ్లను తీసుకొచ్చారు. అయితే కంపెనీ సిబ్బంది ధర నిర్ణయించడంలో అలసత్వం వహించడంతో, బేళ్లను వాహనాలలోనే పెట్టుకొని గంటల తరబడి ఎండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్కువ సేపు ఎండలో ఉంచడంతో దిగుబడుల్లో నాణ్యత తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై కొనుగోలుదారులను అడగ్గా సాయంత్రం 6 గంటల్లోగా కొనుగోళ్లు పూర్తి చేస్తామని చెప్పారు. ముందు రోజు రాత్రి 12 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు దాటితే అద్దె రెట్టింపు చెల్లించాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పోలకల్‌లో నేడు పొలం పిలుస్తోంది

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఓ మల్లేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం గ్రామ రైతు సేవా కేంద్రంలో కార్యక్రమం ఏర్పాటు చేస్తామని,మధ్యాహ్నం నుంచి రైతులతో కలిసి పంట పొలాలను సందర్శిస్తామని పేర్కొన్నారు.